## క్లుప్తంగా

### ఎంబీసీలకు చెక్కులు అందించాలి

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం బీసీబంధు పథకంలో భాగంగా ఎంబీసీలకు ప్రత్యేక కోటా కింద రూ.లక్ష మంజూరు చేస్తామని చెప్పి నేటికీ ఇవ్వకపోవడంతో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండలంలోని ఎంబీసీ కులస్తులు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

### మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన కుమార్తె దీపిక మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కో మృతుల కుటుంబాలకు రూ.10వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు



అందుకున్న అవార్డులతో ఆర్టీసీ సిబ్బంది

ఖమ్మంమామిళ్లగూడెం: టీఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపో పరిధిలోని ఉత్తమ ఉద్యోగులకు మంగళవారం ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### పెద్ద చెరువు ఆయకట్టు రైతుల ఆందోళన

కామేపల్లి: కామేపల్లి పెద్ద చెరువు ఆయకట్టు రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. చెరువు తూము తీయకపోవడంతో నీరులేక ఆయకట్టు కింద పొలాలు ఎండిపోతున్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరారు.

### ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంరాపర్తినగర్: నగరంలోని శాంతినగర్ మిషన్ ఆస్పత్రి ప్రాంగణంలో పల్లా జాన్ రాములు 85వ జయంతి సందర్భంగా ఈ నెల 12 నుంచి 16 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన చిన్న కుమారుడు పల్లా కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్, చిన్న పిల్లలకు సంబంధించిన ఆరోగ్యసమస్యలపై పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

### 'డీఆర్‌ఎస్'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..బీకామ్ తృతీయ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు, ఏఓ వెంకటకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

### కేజీబీవీ విద్యార్థినులకు భద్రత కల్పించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంరాపర్తినగర్: రెండు రోజుల క్రితం అర్ధరాత్రి ఆకతాయిలు సృష్టించిన వికృత చేష్టల వల్ల విద్యార్థినులు భయభ్రాంతులకు గురై ఆస్పత్రిపాలయ్యారని, మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వెలుగుమట్ల కేజీబీవీ విద్యార్థినులకు భద్రత కల్పించాలని ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ నాయకులు కోరారు. మంగళవారం వారు కళాశాలకు వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. అనంతరం అక్కడ ఉన్న అధికారులకు వారు పరిశీలించిన పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి పాలెబోయిన సౌరవ్‌కుమార్, సభ్యుడు రేగళ్ల సతీశ్, పట్టణ కమిటీ కార్యదర్శి స్టాలిన్, చిట్టిబాబు, అక్షయ, సాగర్, మమత తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టంగా ఎన్నికల నియమావళి

**గోడలకు సున్నాలు.. విగ్రహాలకు ముసుగులు..**

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- సోషల్ మీడియా ఆంక్షలపై అవగాహనలు
- నిబంధలు పాటించని వారిపై చర్యలు



రాయగూడెంలో గోడలకు సున్నం వేయిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

నేలకొండపల్లి: తెలంగాణ శాసనసభ ఎన్నికల నగారా మోగడంతో కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కోడ్ అమలులో భాగంగా గ్రామాల్లో పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలను యుద్ధప్రాతిపదికన తొలిగించారు. ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. రాజకీయ నాయకులు హడావుడిగా గత రెండు, మూడు రోజులుగా నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఇక నుంచి వాటికి బ్రేక్ పడినట్లే.

**రాజకీయ రాతలపై సున్నాలు.. విగ్రహాలకు ముసుగులు**

పాలేరు నియోజకవర్గంలో అన్ని పంచాయతీల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇప్పటికే గోడలపై రాతలు, బ్యానర్లు, పోస్టర్లు వేశారు. కాగా, వాటిని తొలిగించేందుకు పంచాయతీ సిబ్బంది నిమగ్నమయ్యారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.జమలారెడ్డి, నేలకొండపల్లి ఏఎస్‌ఐ కోడెత్రాచు సంయుక్తంగా తొలిగించే పనులను పర్యవేక్షిస్తూ.. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలపై ఎటువంటి రాజకీయ పరమైన రాతలు కనపడకుండా తెల్ల సున్నం వేయాలని సూచించారు. అదే విధంగా రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయిస్తున్నారు.

**రెచ్చిపోతే జైలుకే..**

సోషల్ మీడియా వేదికగా వివిధ రాజకీయ పార్టీల నాయకులపై వ్యంగాస్త్రాలు, అనుచిత, అసత్య ప్రచారాలు చేయడం వంటి వాటి నిలపుదలకు పోలీసు శాఖ కసరత్తు ప్రారంభించింది. దీనికోసం మొదట ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో అవగాహన సదస్సులను నిర్వహించి ఎవరైనా సోషల్ మీడియాలో హద్దుమీరి ప్రవర్తిస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ హద్దుమీరితే గ్రూపు



నేలకొండపల్లిలో విగ్రహానికి ముసుగు వేయించిన అధికారులు

అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సోషల్ మీడియాలో రెచ్చిపోతే జైలుకేనని హెచ్చరించారు.

**కోడ్ అమలుకు సహకరించాలి..**



ఎన్నికల నియామావళిని కచ్చితంగా అమలు చేస్తాం. ఇందుకు పంచాయతీల్లో కార్యదర్శులను అప్రమత్తం చేశాం. ఎక్కడా రాజీపడకుండా నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేశాం. అన్ని పార్టీల నాయకులు కోడ్ అమలుకు సహకరించాలి.
– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..**



సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.ఆరోగ్యకరమైన పోస్టులు మాత్రమే షేర్ చేయాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం. అడ్మిన్ కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.
–కె.బస్వారెడ్డి, ఏసీపీ ఖమ్మం రూరల్

**అవగాహన కల్పించాలి..**



ఎన్నికల నియమావళిని సంపూర్ణంగా అమలు చేసేందుకు ప్రతీ పంచాయతీలో అవగాహన సదస్సులను నిర్వహించాలి. కోడ్ అమలులో అధికారులు ఎలాంటి వివక్ష లేకుండా.. ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తీసుకోవాల్సిందే.
– పి.శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు



రఘునాథపాలెం: మాట్లాడుతున్న సత్యనారాయణ



తిరుమలాయపాలెం: దమ్మాయిగూడెం వద్ద తనిఖీ చేస్తున్న ఎస్సై వరాల శ్రీనివాస్

ఖమ్మంమయూరిసెంటర్/ నేలకొండపల్లి/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: ఎన్నికల కోడ్ అమలుకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు విధులను పకడ్బందీగా చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పాలేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సోషల్ వెల్ఫేర్ డీడీ, మండల ఎన్నికల విభాగం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కస్తాల సత్యనారాయణ, నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై వరాల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేఎంసీ సమావేశ మందిరంలో ఆదర్శ్ సురభి, నేలకొండపల్లి మండలంలోని కొంగర క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ చేసిన సందర్భంగా రాజేశ్వరి, రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కస్తాల సత్యనారాయణ, నేలకొండపల్లి మండలంలోని కట్టుకాచారాం, రాయగూడెం తదితర గ్రామాల్లో కోడ్ అమలు తీరును పరిశీలించిన సందర్భంగా జమలారెడ్డి, తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో వాహన తనిఖీలు చేపట్టిన సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో, కట్టడాలపై ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల గుర్తులు, నేతల బొమ్మలు, ప్రభుత్వంకు సంబంధించిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అంతేకాక నగదు తీసుకెళ్లేవారు తప్పకుండా సంబంధిత ఆధారాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, డీసీపీ వికాశ్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్లు శ్వేత, రామకృష్ణ, విల్సన్‌బెన్నీ, ఎంపీడీఓ రామకృష్ణ, డీఈలు, టౌన్ ప్లానింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వైరల్ జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్న నేపథ్యాన గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి అధికారులను కోరారు. మంగళవారం ఈమేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, డెంగీ జ్వరాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలని కోరుతూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన డీఎంహెచ్ఓ మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శిరోమణి మాట్లాడుతూ.. డెంగీ చికిత్సకు రూ.లక్షల ఖర్చు అవుతుండడంతో పేద ప్రజలు ఫీజులు చెల్లించలేక ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌లకు తలుపులు లేవని, ఆస్పత్రిలో వ్యర్థాలు పేరుకుపోతున్నందున తక్షణమే అధికారులు ఆస్పత్రి పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.లలిత, టి.ఝాన్సీ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.మంగతాయి, నాయకులు ప్రతాపునేని శోభ, ఇస్లావత్ స్వాతి, లింగనబోయిన కవిత తదితరులు పాల్గొన్నారు.

# సదాశివాపురం పట్టాలపై విచారణ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: ఎన్నికల నేపథ్యాన మండలంలోని సదాశివాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు అర్హత లేని వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని గ్రామస్తులు ఆరోపించారు. ఈమేరకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుల అధికార దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ.. స్థానిక తహసీల్దార్ శ్వేతకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ స్థలాలను గ్రామసభ నిర్వహించకుండా, లబ్ధిదారులను ఎంపిక చేయడం సిగ్గుచేటని, ఇచ్చిన పట్టాలను రద్దు చేసి అర్హత కలిగిన వారికే అందించాలని గ్రామస్తులు కోరారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.అశోక్, డి.సుధాకర్, ఎం.నాగేశ్వరరావు, ప్రవీణ్, బాలస్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌అండ్‌బీ ఎస్ఈకు శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కంభంపాటి శ్యామ్‌ప్రసాద్‌ను తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఈఏ) ఆధ్వర్యాన ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదబోయిన నాగరాజు, బెజ్జంకి ప్రభాకరాచారి, నాయకులు వెంకటరమణ, జయలక్ష్మి, రబ్బానీ, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

### నివాళి..

ఖమ్మంరూరల్: మండలంలోని కస్నాతండాకు చెందిన గుంటి కృష్ణమూర్తి ఎంవెంకటాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని మంగళవారం సీపీఐ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుచ్చకాయల కమలాకర్, సుధాకర్, రామ్మూర్తి, సురేశ్, కృష్ణ, వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వల్లాల లక్ష్మణస్వామి, బానోత్ పాపానాయక్ తదితరులు ఉన్నారు.

**న్యాయవాది మృతికి సంతాపం..**

ఖమ్మం లీగల్: నగరానికి చెందిన న్యాయవాద సహకార సంఘం సభ్యుడు, సీనియర్ న్యాయవాది, ఖమ్మం బార్ అసోసియేషన్ సీనియర్ సభ్యుడు అన్నసముద్రం శరత్‌చంద్ర మంగళవారం ఉదయం పూణాలో మృతి చెందాడు. సీనియర్ న్యాయవాది మృతికి న్యాయవాద సహకార సంఘం అధ్యక్షుడు కాసర రాజశేఖర్‌రెడ్డి, సహకార సంఘం కార్యవర్గం ఆయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ తెల్లాకుల రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు హేమంత్ కుమార్, కోశాధికారి చుంచు మల్లికార్జునరావు, నోముల వెంకటేశ్వరరావు, నేరళ్ల శ్రీనివాస రావు, యాస క్రాంతికుమారి, బెండడి కుమార్ పాల్గొన్నారు.

### రచయిత 'జ్యోసుల' సంస్మరణ సభ

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల పరమపదించిన ప్రముఖ రచయిత, మహోపాధ్యాయ ఆచార్య జ్యోసుల సూర్యప్రకాశ్‌రావు సంస్మరణ సభను మంగళవారం నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూ విశ్వ విద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, సభను ఆచార్య చల్లా శ్రీరాంచంద్రమూర్తి సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వ విద్యాలయ పూర్వ శాఖాధిపతి ఆచార్య వేదుల సుబ్రమణ్యశాస్త్రి మాట్లాడుతూ.. జ్యోసుల సూర్యప్రకాశ్‌రావు 15 భాషల్లో నిష్ణాతులని అభివర్ణించాక నివాళులర్పించారు. ఈ సభలో ఆచార్యులు శలక రఘునాథశర్మ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయ ఆచార్యులు ఎస్‌వీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త ఉపదేశాలతో సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న అస్మా అన్జుమ్

ఖమ్మం మామిళ్లగూడెం: అన్ని సమస్యలకు మహా ప్రవక్త ఉపదేశాల్లో పరిష్కారం ఉంటుందని జమాతే ఇస్లామి హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ అన్నారు. అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర సదస్సులో ఆమె మాట్లాడారు. మానవులంతా ఒక్కటే, అందరి దేవుడు ఒక్కడే అనేది ప్రవక్త సందేశమన్నారు. ఈ కార్యక్రమంలో రజియాబాను, సైదాబాను, మహీవీన్, నాహియ, అమీనా, ఆయేషా, జబీన్, అతహర్, సుల్తానా, అఫ్‌రోజ్, నస్రీన్, హాజిరా, సమీనా, జహిరా, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ గెలుపునకు జనసైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న జన సైనికులు

ఖమ్మంరాపర్తినగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు జనసైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ ఖమ్మం నియోజక ఇన్‌చార్జ్ మిరియాల రామక్రిష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జనసేన పార్టీ ఆధ్వరాన చేపట్టిన రైతు, యువజన పోరాటాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం నగర అధ్యక్షుడు మేడబోయిన కార్తీక్, నగర ప్రధాన కార్యదర్శి యాసంనేని అజయ్‌కృష్ణ, ఉపాధ్యక్షుడు బానోత్ దేవేందర్, మండల నాయకులు సచ్చు స్రవంత్ కన్నా, మహిళా నాయకురాలు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# వివాదాస్పద వ్యాఖ్యలు షేర్ చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సతీశ్

నేలకొండపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివాదాస్పద వ్యాఖ్యలు సోషల్ మీడియా ద్వారా షేర్ చేయొద్దని ఎస్సై సతీశ్ తెలిపారు. మంగళవారం పలు రాజకీయ పార్టీల నాయకులు, సోషల్ మీడియా ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలు చేస్తే నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు బచ్చలకూరి నాగరాజు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కే.వీ.రెడ్డి, బోయిన వేణు, కొండలరావు, కడియాల నరేశ్, కుక్కల ఆదాం, కొమ్మూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ శవాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన రెండు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో రెండు అనాథ శవాలు ఉండగా.. వాటిని తీసుకెళ్లడానికి ఎవ్వరూ రాకపోవడంతో పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమాచారంతో అన్నం సేవా ఫౌండేషన్ వారు ముందుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలను విమర్శించడం సరికాదు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రతిపక్షాలపై ఇష్టారాజ్యంగా విమర్శలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ అన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల రెండు రోజుల్లో పులి బయటకు వస్తుందని, ప్రతిపక్షాలకు ఓటమి తప్పదని అనడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, కేసీఆర్‌ను ఈసారి ఫామ్‌హౌస్‌కే పరిమితం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మంద సరస్వతి, కళ్లెం విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండలాల్లో ప్రసాద్‌రెడ్డి పర్యటన



నేలకొండపల్లి: రామచంద్రాపురంలో ప్రచారం చేస్తున్న ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లి, రామచంద్రాపురంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అలాగే ఖమ్మంరూరల్ మంగళగూడెంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కన్నేటి వెంకన్న పరామర్శించి.. అదేగ్రామంలో మృతిచెందిన బుర్రా వీరబాబు, గుంటి కృష్ణమూర్తి మృతదేహాలకు నివాళులర్పించారు. ఆరేకోడు గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, సూదాగాని ఉపేందర్, బోజెడ్ల వెంకటయ్య, నెల్లూరి భద్రయ్య, కోడాలి గోవిందరావు, కుంజుల మోహన్‌రెడ్డి, పల్లెబోయిన లక్ష్మినారాయణ, స్వర్ణ, గరిడేపల్లి రామారావు, ఎ.అశోక్, గోనె భుజంగరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

### టీటీలో సత్తా చాటిన మాస్టర్



యాకుబ్‌అలీని అభినందిస్తున్న రవిమారుత్

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ మాస్టర్స్ క్రీడల్లో భాగంగా నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన టేబుల్ టెన్నిస్ కోచ్ ఎస్‌కె.యాకుబ్‌అలీ 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ క్రీడల్లో తన సత్తా చాటాడు. ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో వరుస విజయాలతో ప్రథమస్థానంలో నిలవడంతో పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు.

### చదువుకున్న పాఠశాలకు మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ ఇస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక పాఠశాలకు ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని తేజస్విని మైక్ సెట్‌ను వితరణగా అందించారు. 2022 -2023 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో చదివిన ఆమె రూ.8వేల విలువైన మైక్ సెట్‌ను అందించారు. ఈమేరకు పి.శిరీష, ఆమె తండ్రి సురేశ్‌లకు పాఠశాల హెచ్ఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యలు పరిష్కరించాలని జేసీకి వినతి



జేసీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: వాణిజ్య పన్నుల విభాగం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వంగా వెంకటేశ్వరరావు కోరారు. ఈసందర్భంగా మంగళవారం ఖమ్మం వచ్చిన వరంగల్ రీజియన్ జాయింట్ కమిషనర్ వి.శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాగా, తమ సమస్యల పట్ల జేసీ సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. సంఘం కార్యదర్శి కొండవీటి లక్ష్మీదేవితో పాటు తూమాటి రాంబాబు, మహ్మద్ ముజాహిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**టీఎన్జీవోస్ ఆధ్వర్యాన...**

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం వచ్చిన కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్(జేసీ) శ్రీనివాసరెడ్డిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ ఆధ్వర్యాన ఉద్యోగులు కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి, సర్వీస్ రెగ్యులైజేషన్ తదితర సమస్యలను వివరించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఎండీ.మజీద్, అనుదీప్, నందగిరి శ్రీను, శాబాసు జ్యోతి, వెంకటరెడ్డి, శివస్వప్న, సవర్జన్ పాల్, బుద్ధా రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, ఫిరంగి శ్రీను, గులాం అఫ్జల్ పాల్గొన్నారు.